# కడుపు మంట

కె.వి.యస్.వర్మ

"అట్టా కుంటుతున్నావేటే మరదలు పిల్లా"

"ఏదో మోటు సామెతనాగయ్యిందే నా పని నల్లొదినా"అంది తెల్లావు.

"ఇసయమేంటో సెప్పు తొందరగా" నల్లావు ఆత్రంగా అడిగింది.

"మనూరి ఆంబోతుగాడు ఈ మద్దిన నా ఎనకపడి సంపుతున్నాడు. ఇయేల పోనీలే పాపం అని తలూపాను. అసలే ఆంబోతుగాడు. కుమ్మేసినాడు. మద్దిలో నా కాలును గట్టిగా మట్టేసినాడు సచ్చినోడు..."

"సరదా తీరిందన్నమాట. బలే బాగున్నాది" అంది నల్లావు వచ్చే నవ్వునాపుకొంటూ.

"ఏటొసే నల్లొదినా, ఏదో అడిగావు గందా అని ఏదీ దాయకుండా సెబితే, బలే బాగున్నాదంటూ ఎటకారాలాడుతున్నావు" అంది తెల్లావు ఎర్రబడిన ముఖంతో.

"అట్టాంటప్పుడు ఇట్టాంటివి మామూలే కానీ, మన ఎర్రావు కనబడదేంటీ. ఎక్కడ పెత్తనాలు సేస్తున్నాదో ఏంటో"

"నానూ ఇప్పుడే వచ్చేను గందా. నాకు మాత్రం ఏం తెలుస్తాది" అంటూ తెల్లావు రెండు గడ్డి పరకలు నాలుకతో లాగింది.

'ఓలమ్మో ఏం ఎండ ఏం ఎండ. కడుపు కూడా మండిపోతున్నాది" అంటూ ఎర్రావు వచ్చింది.

"నూరేళ్లాయుస్సు. ఇప్పుడే నీ ఊసు అడిగేను. ఎక్కడికి పోయావే ఎర్ర మరదలా" అంది నల్లావు తనూ నాలుగు గడ్డి పరకలు నోట్లో వేసుకుంటూ.

"మీకేంటే సక్కగా పాలిస్తన్నారు కాబట్టి ఏ గడ్డి పరకలన్నా సరిపోతాయి. నేనేమో వట్టి పశువునుకూడా కాను. మనోడు పెట్టే గడ్డి నాకు సరిపోవడం నేదు. రెండు పేణాలకు ఆ నాలుగు గడ్డి పరకలూ ఏ మూలకొస్తాయి సెప్పొదినా"

"నిజమేనే ఎర్రమరదలా.ఆ ఇంగితం మనోడికుండాలా..."

"నేదు కాబట్టే, ఆకలికుండనేక పూర్ణా మార్కెట్ దాకా పోయేను. అక్కడి యాపారులు వదిలిపోయిన ఆక్కూరలూ గట్రా పారేస్తారుకదా, తిందామని ఎళ్లేను. ఏవో పచ్చగా ఉన్నాయి గందా అని ఆబగా నోట్లో ఎట్టుకుని నమిలేటప్పటికి తెలిసిందే..."

"ఏంటే అవీ" అని నల్లావూ తెల్లావూ ఒకేసారి అడిగాయి.




"పచ్చిమిరపగాయలే తల్లీ. అమ్మో కనకమాలచ్మి తల్లీ, నాకీ ఆకలి ఎందుకు పెట్టాల. ఆహారం సూపించినట్టే సూపించి నా గూబ ఎందుకు గుయ్యిమనిపించాల అని ఎన్నిసార్లు మనసులో అనుకున్నానో ఓలప్పో నాకు తెలుసు. ఆ కనకమాలచ్మి తల్లికి తెలుసు"

"పచ్చిమిరపకాయలా, పచ్చి పాలకూరకాడలా అని ఓసారి జాగర్తగా సూసుకోవద్దూ..."

"ఆకలి రుచి ఎరగదన్నారు గందా మన పెద్దోళ్లు. అది నిజమేనే. గూబగుయ్యిమంటున్నా ఆగకుండా అక్కడున్న పచ్చి మిరపకాయలన్నీ తినేసేనే. 'దాంతో కడుపు తెగ మండిపోతున్నాది"

"బలే బాగున్నాది" అంది నల్లావు కళ్లు మూసుకుంటూ.

"నల్లొదినా, ఏటా ఎటకారాలూ. నా బాద నీ బాద కాదా" అంది ఎర్రావు మరింత ఎర్రబడిన ముఖంతో.

"ఏవే సెల్లీ. నీకే అంత కడుపు మండిపోతూంటే, రాత్రింబగళ్లు సెమటోడ్చి పండించిన మిర్చిని గిట్టుబాటు దర నేక గుంటూరు మార్కెట్‌యార్డు దగ్గర తగలబెట్టారంటే ఆ రైతన్నలకు ఇంకెంత కడుపుమండిపోయి ఉంటాది" అంది తెల్లావు.

"బలే బాగున్నాది" అంది నల్లావు ఆకాశం వంక చూస్తూ.

"అవును మరి. మంత్రి మణికుమారి పెనిమిటిని నక్సలైట్లు పాడేరులో సంపేసి నారు. అదే టైములో మహారాష్ట్రలో ఉప ప్రెదాని అద్వానీ గోరు నక్సల్లై గురించి పట్టించుకోమాకండి అని సెలవిచ్చినారు. ఇంక టిక్కెట్ల కోసరం అన్ని పార్టీ వోళ్లూ గోలగోల సేస్తన్నారు. ఆత్మహత్యల బెదిరింపులు కూడా సేస్తన్నారు. ఒకళ్లనొకళ్లు తిట్టుకుంటున్నారు. నాకే కనుక ఓటు ఉంటే అందరినీ ఏదో ఒకలాగ కష్టపెట్టేవోళ్లకు బుద్ధి వచ్చేలా చేద్దును" అంది ఎర్రావు ఆవేశంగా.

"అంతా బావున్నాది. ఫీల్ గుడ్" అంది నల్లావు తెల్ల పళ్లు కనిపించేలా నవ్వుతూ.

"గాడిద గుడ్డేం కాదు" అంది ఎర్రావు చిటపటలాడుతూ.

## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒక వైపున మాత్రమే రాయాలి.

* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.

* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.

* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.

* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జత పరచాలి.

* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకుంటే తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.

* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావు లేదు.

* ఆరోగ్యకరమైన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.

* కార్టూన్లు కూడా ప్రచురిస్తాం. అర్థవంతమైన కార్టూన్లు పంపించండి.

* సమీక్షకోసం పుస్తకాలను విధిగా రెండు కాపీలు పంపించాలి.

మా చిరునామా:

ఆదివారం వార్త,

ఎడిటర్, 'వార్త' తెలుగు దినపత్రిక,

లోయర్ ట్యాంక్‌బండ్,

హైదరాబాద్-500080